ఆదరణ తగ్గని.. పేదవాడి ఫ్యాన్

- విసనకర్రలతో వేసవిలో చక్కటి ఉపశమనం
- కరెంట్ పోయినప్పుడు అంతా ఆశ్రయించేది దీనినే

జగదాంబ: ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు రాజ్యమేలుతున్న ఈ ఆధునిక యుగంలో కూడా పేదవాడి ఫ్యాన్‌గా పేరు తెచ్చుకున్న విసన కర్రలకు ఆదరణ తగ్గలేదు. ధనవంతులు ఏసీతో సేదదీరితే.. పేదవాళ్లు విసన కర్రతో ఉపశమనం పొందుతున్నారు. ప్రస్తుత ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న జనం ఫ్యాన్లు, ఏసీలు వాడుతున్నప్పటికీ కొన్ని చోట్ల మాత్రం విసన కర్రలనే ఆశ్రయిస్తున్నారు. వృద్ధులు, చిరు వ్యాపారులు, ఆస్పత్రుల


దుస్తుల దుకాణంలో విద్యుత్ లేక విసనకర్రతో విసురుకుంటున్న మహిళలు


ఎండ వేడికి విసురుకుంటున్న విసన కర్రల వ్యాపారి

బెడ్ మీద ఉండేవాళ్లు, పల్లెసీమల ప్రజలు విసన కర్రలనే ఉపయోగిస్తున్నారు. అలాగే ఊయలలో చిన్నారులను నిద్ర పుచ్చే తల్లులు విసన కర్రలతో తమ బుజ్జాయిలకు చల్లదనం అందిస్తున్నారు. చేతిలో సులువుగా ఇమిడిపోయే విసన కర్రలు పూర్ణామార్కెట్‌లో విరివిగా లభ్యమవుతున్నాయి. తక్కువ ధర.. సులువుగా వినియోగించగలిగే విసన కర్రల విక్రయాలు ఇప్పటికీ బాగానే జరుగుతున్నాయి. కరెంట్ పోయినప్పుడు చాలా మంది విసన కర్రలనే ఆశ్రయిస్తున్నారు.

కుటీర పరిశ్రమగానూ..

రూ. 10 నుంచి రూ. 20కి దొరికే విసన కర్రల వ్యాపారం కొన్ని చోట్ల కుటీర పరిశ్రమగా కొనసాగుతోంది. గతంలో వీటిని కేవలం మేదర వృత్తి చేసుకునే వారు మాత్రమే తయారు చేసి విక్రయించేవారు. తట్టలు, బుట్టల అల్లికతో పాటు కమ్మరేకులు, వెదురుతో విసన కర్రలు తయారు చేసేవారు. అలాగే తాటి కమ్మలతోను విసనకర్రలు తయారు చేస్తున్నారు. ఫ్యాన్సీ దుకాణాల్లో ప్లాస్టిక్ విసన కర్రలు కూడా దొరుకుతాయి. అయితే కమ్మరేకులు, వెదురు కలిపి తయారు చేసే విసన కర్రలంటేనే జనం మొగ్గు చూపుతున్నారు. వీటితోనే చల్లటి గాలి వీస్తుందని చెబుతున్నారు. ఈ విసన కర్రలను విజయనగరం జిల్లా జొన్నాడ, విశాఖ జిల్లా సబ్బవరం, పెందుర్తి, అనకాపల్లి జిల్లా నర్సీపట్నం తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు తీసుకువచ్చి హోల్‌సేల్ ధరలకు అమ్ముకుంటున్నారు. వాటిని ఇక్కడి వ్యాపారులు రిటైల్ ధరకు విక్రయిస్తూ లాభం పొందుతున్నారు.


పేదవాడి ఫ్యాన్.. విసన కర్రలు


విసురుకుంటూ ఉపశమనం పొందుతున్న వృద్ధురాలు

క్లుప్తంగా

శారదాపీఠాన్ని దర్శించుకున్న వాసుపల్లి


స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి నుంచి అమ్మవారి చిత్రపటం అందుకుంటున్న వాసుపల్లి

దాబాగార్డెన్స్: శారదాపీఠంలోని రాజశ్యామల అమ్మవారిని వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ బుధవారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మ దయతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికల్లో విజయం సాధించి మళ్లీ అధికారంలోకి రావాలని, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులందరూ విజయం సాధించాలని మొక్కుకున్నట్టు తెలిపారు. అమ్మ దర్శనం అనంతరం శారదాపీఠం పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతిని కలిసి ఆశీస్సులు పొందారు. స్వామి అమ్మవారి చిత్రపటాన్ని వాసుపల్లి గణేష్‌కుమార్‌కు బహూకరించారు.

డిగ్రీ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

దాబాగార్డెన్స్: ఆంధ్రా యూనివర్సిటీ ప్రకటించిన డిగ్రీ పరీక్షా ఫలితాల్లో శ్రీకాశ్యప్ విద్యార్థులు ప్రతిభ చూపారు. బీబీఏ విద్యార్థిని కె. జ్యోత్స్న 9.05 క్రెడిట్లతో ఏయూలో 2వ ర్యాంకు సాధించింది. అలాగే బీఎస్సీ–ఎంసీఎస్‌లో వి. సాయి తనూషా 9.17, బీఎస్సీ–ఎంపీసీలో దివ్య 8.91, బీఎస్సీ–ఎంఈసీలో పి. మేఘన 8.09, బీకాంలో కె. వరలక్ష్మి 8.32తో కళాశాలలో ప్రథమ స్థానం సాధించారని కరస్పాండెంట్ టీఆర్ఎస్ వర్మ తెలిపారు. ఇదే స్ఫూర్తితో మిగిలిన విద్యార్థులు కూడా తమ ప్రతిభా పాటవాలు కనబరుస్తారని ఆకాంక్షించారు. డైరెక్టర్ ఎస్ఎన్ మూర్తి, ప్రిన్సిపాల్ ఎల్. జ్యోత్స్న విద్యార్థులను అభినందించారు.

చురుగ్గా దివ్యాంగ బాలల సర్వే


సర్వేలో పాల్గొన్న ఎంఈవో బాలామణి

సీతంపేట: బడి బయట ఉన్న దివ్యాంగ బాలలను గుర్తించేందుకు సర్వే చేస్తున్నట్టు ఎంఈవో బాలామణి తెలిపారు. అక్కయ్యపాలెం, జగ్గారావు బ్రిడ్జి ప్రాంతాల్లో బుధవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగ బాలలను గుర్తించి భవిత సెంటర్‌లో చేర్పించాలని కోరారు. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ ఆవరణలోని భవిత సెంటర్‌లో ఉన్న సదుపాయాలు, ఫిజియోథెరపీ సేవలు, ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, రాయితీలు, దివ్యాంగులకు ఇచ్చే శిక్షణపై బాలల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. ఇప్పటి వరకు 20 మంది బాలలను గుర్తించామన్నారు. జూన్ 9 వరకు ఈ సర్వే కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో భవిత టీచర్స్ జగదాంబ, శారద పాల్గొన్నారు.

వార్షికోత్సవ పత్రికావిష్కరణ

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు కొండవాలు ప్రాంతం వరాహగిరి కాలనీ–2లోని అన్నపూర్ణ సహిత కాశీవిశ్వేశ్వరాలయంలో జూన్ 16 నుంచి 29 వరకు 25వ వార్షిక ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం శివాలయంలో భక్తులు, స్థానికులతో కలసి ఆలయ అర్చకుడు అంబటిపూడి సుధీర్ శర్మ వార్షికోత్సవ కరపత్రికను ఆవిష్కరించారు. 25వ వార్షికోత్సవం సందర్భంగా వేదమాత గాయత్రిదేవికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని సుధీర్ శర్మ తెలిపారు.

జగన్ రెండోసారి సీఎం కావాలని కోరుతూ మేయర్ పూజలు

దాబాగార్డెన్స్: ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి బాధ్యతలు చేపట్టాలని ఆకాంక్షిస్తూ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, శ్రీనివాస్ దంపతులు పూజలు చేపట్టారు. ఈ నెల 28 వరకు నగరంలోని పలు గ్రామ దేవతలను దర్శించుకుని సీఎం జగన్ కోసం ప్రత్యేక పూజలు జరిపించిన మేయర్ కుటుంబ సభ్యులు.. బుధవారం గుజరాత్‌లోని ద్వారకను సందర్శించారు. రాష్ట్ర ప్రజలంతా క్షేమంగా ఉండాలని శ్రీకృష్ణ భగవానుడికి మొక్కుకున్నట్టు మేయర్ తెలిపారు. అభివృద్ధి, సంక్షేమాన్ని ఏకకాలంలో అమలు చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం మరింత ప్రగతిపథంలో దూసుకుపోతుందన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ భారీ విజయం సాధిస్తుందన్నారు.


ద్వారకలో కుటుంబ సభ్యులతో మేయర్ హరి వెంకటకుమారి

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

దాబాగార్డెన్స్: కొమ్మాది పంప్ హౌస్‌కు సంబంధించి పంప్ సెట్ మరమ్మతుల కారణంగా జోన్–2, 3 పరిధి పలు ప్రాంతాలకు గురువారం తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని పర్యవేక్షక ఇంజినీరు కేవీఎన్ రవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జోన్–2 పరిధి చినగదిలి, పెదగదిలి, సూర్యతేజనగర్, గాంధీనగర్, బాలాజీనగర్, ఆదర్శనగర్, హనుమంతవాక, 10వ వార్డుకి సంబంధించి అన్ని ప్రాంతాలు, జోన్–3 పరిధి చినవాల్తేర్, పెదవాల్తేర్, ఆదర్శనగర్, ఎంవీపీ సెక్టార్–8, 11 తదితర ప్రాంతాలకు తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనున్న దృష్ట్యా ఆయా ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతుందని ఎస్ఈ తెలిపారు.

1న హనుమత్ జయంతి


అంబికాబాగ్ రామాలయంలో తమలపాకుల అర్చనలో ఆంజనేయస్వామి


భానోజీనగర్‌లో వెలసిన ధ్యానాంజనేయ స్వామి

దాబాగార్డెన్స్: హనుమత్ జయంతి వేడుకలు జూన్ 1న పలు ఆలయాల్లో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆంజనేయస్వామి ఆలయాలన్నీ విద్యుద్దీపాలతో అలంకరించారు. పూర్ణా మార్కెట్ మెయిన్‌రోడ్డులో గల ఆంజనేయస్వామి ఆలయంతో పాటు నియోజకవర్గ పరిధిలో గల పలు ఆంజనేయ స్వామి ఆలయాల్లో పెద్ద ఎత్తున పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. రాముల వారి ప్రియభక్తుడైన ఆంజనేయస్వామిని ఆరాధించేందుకు భక్తులు అధిక సంఖ్యలో అంజనీపుత్ర ఆలయాలకు తరలి రానున్న దృష్ట్యా ఆలయాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారు. ఆంజనేయస్వామిని పుష్పాలంకరణతో తీర్చిదిద్దనున్నారు. ఆ రోజు ఉదయం 5 గంటలకు ప్రభాతసేవతో హనుమత్ జయంతి కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు.

పూర్ణానంద సమాజంలో..

హనుమత్ జయంతి కార్యక్రమాన్ని పురస్కరించుకుని పూర్ణానంద సమాజంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, తమలపాకు, సింధూర అర్చనలు నిర్వహించనున్నారు.

అంబికాబాగ్ రామాలయంలో..

మహారాణిపేటలో గల అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో హనుమత్ జయంతి వేడుకగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, తమలపాకు సింధూర అర్చనలు జరపనున్నారు.

భానోజీనగర్ ధ్యానాంజనేయ స్వామి ఆలయంలో..

హనుమత్ జయంతిని పురస్కరించుకుని భానోజీనగర్‌లో వెలసిన ధ్యానాంజనేయ స్వామి ఆలయంలో ఆ రోజున ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకుడు గోపా జోష్యుల సత్య జగన్నాథ శర్మ తెలిపారు. ఆ రోజు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్వామికి పంచామృతాభిషేకం, అలంకరణ, సహస్ర నామార్చన, తమలపాకుల పూజ, సింధూర అర్చన, అష్టోత్తర ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు చెప్పారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు అర్చన, షోడశోపచార పూజ, దివ్య మంగళ హారతులు జరపనున్నామని, పూజా కార్యక్రమంలో పాల్గొనదలిచే భక్తులు 9059050999 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

ఎరుకుమాంబకు ప్రత్యేక పూజలు

సీతమ్మధార: దొండపర్తిలో కొలువుదీరిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు స్వహస్తాలతో జలాభిషేకం చేశారు. పసుపు నీళ్లతో అమ్మవారిని అభిషేకిస్తే కోర్కెలు నెరవేరుతాయని.. అవివాహితులకు వివాహం, సంతానం లేని వారికి పిల్లలు కలుగుతారనే నమ్మకంతో భక్తులు అమ్మవారిని అభిషేకిస్తారని ఆలయ అర్చకులు శ్రీనివాస్ తెలిపారు. దొండపర్తి, నెహ్రూబజార్, రైల్వేన్యూకాలనీ, పెదవాల్తేరు, మద్దిలపాలెం, అక్కయ్యపాలెం, శివాజీపాలెం, ఎస్ఏడీ, సీతమ్మధార, నక్కవానిపాలెం, రేసవానిపాలెం, జగదాంబ, వన్‌టౌన్ తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వచ్చిన భక్తులు అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు శ్రీనివాస్ భక్తుల గోత్రనామాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం కూడా అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.


ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

కుటుంబ వ్యవస్థ పరిరక్షణకు కృషి


మాట్లాడుతున్న మానసిన వైద్యుడు విజయ్‌కుమార్

సీతంపేట: సమైఖ్య భారతి ఆధ్వర్యంలో బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'కుటుంబ వ్యవస్థ పరిరక్షణ' అనే అంశంపై సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా మానసిక వైద్యుడు మోపిదేవి విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం కావడానికి కార్పొరేట్ విద్యను అభ్యసించిన విద్యాధికులు అవలంబిస్తున్న ఆర్థిక విధానాలే ప్రధాన కారణమన్నారు. ఆచార్య సి.మంజులత మాట్లాడుతూ కుటుంబ సభ్యులు కలిసి చర్చించుకునే పద్ధతి లోపించడం వల్ల ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కనుమరుగైందన్నారు. ఎం.రూపవాణి మాట్లాడుతూ మహిళలు ఐకమత్యంగా ఉంటే చిన్న కుటుంబాలుగా విడిపోవన్నారు. సమైఖ్య భారతి జాతీయ సమన్వయకర్త పి.కన్నయ్య మాట్లాడుతూ బిజీ జీవితంలో కుటుంబ సభ్యులు కలిసి కూర్చుని మాట్లాడుకునే వీలు కూడా లేకుండా పోయిందన్నారు. కుటుంబ సభ్యులు అంతా కలిసి భోజనం చేస్తూ ఒకరి అభిప్రాయాలు ఒకరు చర్చించుకుని కష్టసుఖాల్లో తోడు ఉండేలా ఉండాలని పేర్కొన్నారు. భావితరాలకు మంచి సందేశాన్ని ఇచ్చేలా, కుటుంబ వ్యవస్థ గొప్పతనాన్ని పిల్లలకు తెలియజేయాలన్నారు. రచయిత మేడా మస్తాన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు చినసూర్యనారాయణ, డాక్టర్ కె.వి.ఎస్.మూర్తి, చింతా ప్రభాకర్, ఫణిస్వామి, పత్తి ప్రసాద్ తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. అనంతరం ఎంవీఆర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గాయణీ గాయకులు సినీగీతాలు ఆలపించి అలరించారు.

చిత్రలేఖన పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

మురళీనగర్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మురళీనగర్ బాలభాను విద్యాలయం ప్రాంగణంలో మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జూన్ 2న విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు 'ప్రపంచ పర్యావరణం–పరిరక్షణ' అనే అంశంపై పోటీ జరుగుతుందన్నారు. 3–5 తరగతులు, 6–8 తరగతులను ప్రత్యేక విభాగాలుగా ఏర్పాటు చేసి పోటీలు నిర్వహిస్తామన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందిస్తామని చెప్పారు. విద్యార్థులకు డ్రాయింగ్ షీట్స్ ఇస్తామని, క్రేయాన్స్, కలర్స్‌లు వారే తెచ్చుకోవాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 94926 41242, 91210 07683 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

ఘనంగా దుర్గమ్మ జాతర

సీతమ్మధార: దొండపర్తి గ్రామ దేవత శ్రీ దుర్గమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఈ వేడుకలు నెలరోజులు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. జాతర నేపథ్యంలో జూన్ 4న దొండపర్తిలో వేంచేసిన అమ్మవార్లకు పసుపు కుంకుమలు సమర్పిస్తారు. 10వ తేదీన పుట్టబంగారంతో పాటు అమ్మవారిని గ్రామంలోకి తీసుకొచ్చి 9 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారని గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి అల్లూరి సత్యనారాయణరెడ్డి, కారాల మహేష్ తెలిపారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. నేలవేషాలు, కాళీమాత వేషధారణలో కళాకారులు తమ ప్రతిభ ప్రదర్శించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. గ్రామ కమిటీ పాలక వర్గ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


బాలుడిని తిప్పుతున్న పులివేషధారుడు


కాళీమాత వేషంలో కళాకారుడు

నిప్పుల కొలిమి


కర్ఫ్యూను తలపిస్తున్న వైజాగ్ సెంట్రల్ జంక్షన్


బోసిపోయిన వన్‌టౌన్ ఏరియా


నిర్మానుష్యమైన రామకృష్ణా రైతుబజార్ జంక్షన్

- బెంబేలెత్తించిన రోహిణికార్తె ఎండ
- బయటికి రావటానికి భయపడిన జనం
- నిర్మానుష్యంగా పూర్ణామార్కెట్, దుర్గాలమ్మ గుడి ప్రాంతం, రామకృష్ణా జంక్షన్ తదితర ప్రాంతాలు

జగదాంబ: బుధవారం భానుడి భగభగలతో జనం విలవిల్లాడిపోయారు. రోహిణి కార్తె ఎండలు ఠారెత్తించాయి. ఎండ వేడికి రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి. బయటికి రావటానికి జనం బెంబేలెత్తిపోయారు. ఉదయం ఎనిమిది గంటల నుంచే ఎండ తన ప్రతాపం చూపటంతో జనం బయటికి రావటానికి సాహసించలేదు. అత్యవసర పనులపై బయటికి వచ్చిన వారు మాత్రం గొడుగులు.. టోపీలను ఆశ్రయించారు. ఉష్ణతాపం నుంచి ఉపశమనం కోసం కొబ్బరిబొండాలు, శీతల పానీయాలను ఆశ్రయించారు. నిత్యం రద్దీగా ఉండే పూర్ణా మార్కెట్ కూడా జనం లేక బోసిపోయింది. అలాగే వన్‌టౌన్ ఏరియా, ఎప్పుడూ జనంతో కిటకిటలాడే రామకృష్ణా జంక్షన్, 75 ఫీట్ రోడ్డు, దుర్గాలమ్మ గుడి కూడలి, పోలీస్ బ్యారెక్స్ వంటి ప్రాంతాలు జనాలు లేక నిర్మానుష్యంగా కనిపించాయి. చిరు వ్యాపారులు గిరాకీ లేక డీలా పడ్డారు. బేరాలు లేక ఆటోవాలాలు ఏ చెట్టు నీడనో ఆశ్రయించారు. భవన నిర్మాణ కూలీలు మాత్రం అంతటి ఎండలోనూ చెమటలు కక్కుతూ పని చేసి.. విరామ సమయంలో నీడ పట్టున సేదదీరారు. చెట్ల కింద భోజనాలు చేసి విశ్రమించారు.


జనసంచారం లేని 75 ఫీట్ రోడ్డు


ఎండకు భయపడి నీడ పట్టున సేదదీరుతున్న కూలీలు


చెట్టు నీడన భోజనం చేస్తున్న కూలీలు

పర్యావరణ పరిరక్షణ.. ప్రజల బాధ్యత

మద్దిపాలెం: భూగోళం మీద ఉన్న సమస్త జీవరాశులను, పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనని విశాఖపట్నం డివిజన్ కాలుష్య నియంత్రణ మండలి జాయింట్ చీఫ్ ఇంజినీర్ కె.రమేష్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మాధవధారలోని సంస్థ కార్యాలయంలో ఆయన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఏపీ పీసీబీ, గ్రీన్ క్లైమేట్ టీం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవం మన భూమి అంశంపై జరుగుతుందని తెలిపారు. భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువును తట్టుకునే శక్తిపై దృష్టి సారించాలని ఐక్యరాజ్య సమితి పిలుపునిచ్చిందన్నారు. రీజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.వి.ముకుందరావు మాట్లాడుతూ విశాఖలో చిత్రలేఖనం వంటి పోటీలు జరుగుతాయని చెప్పారు. అనకాపల్లి, మన్యం జిల్లాల్లోనూ స్వచ్ఛంద సంస్థల సహకారంతో పర్యావరణ అవగాహన కార్యక్రమాలు తలపెట్టామన్నారు. మండలి ఈఈ కరుణరేఖ, ఏఈ శ్రీలక్ష్మి, సైంటిఫిక్ ఆఫీసర్ సంయుక్త, రీసెర్చ్ అసోసియేట్ గౌతమి తదితరులు పాల్గొన్నారు.


పర్యావరణ దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీసీబీ అధికారులు, గ్రీన్ క్లైమేట్ టీం ప్రతినిధులు

మలయాళ నవల 'ఆడు జీవితం'పై ప్రసంగం

సీతంపేట: సహృదయ సాహితీ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో కేరళ సాహిత్యంపై జరిగిన సాహితీ కార్యక్రమంలో మలయాళ రచయిత, కేరళ సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బెన్యామిన్ రచించిన ఉత్తమ మలయాళ నవల 'ఆడు జీవితం'పై రచయిత, డాక్టర్ కె.జి. వేణు ప్రసంగించారు. సౌదీ అరేబియాలో వలస వచ్చిన కార్మికులను ఎలా బానిసలుగా మారుస్తారో చెప్పే నవలగా పేర్కొన్నారు. కేరళలోని ఒక గ్రామంలో బోటు నడుపుకుని జీవించే నజీబ్ అనే వ్యక్తి వ్యాపారం బాగా లేదని గల్ఫ్ దేశాలకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకోవాలని అనుకుంటాడన్నారు. ఒక ఏజెంట్ ద్వారా సౌదీ అరేబియాకు చేరుకున్న నజీబ్ అక్కడ పడిన కష్టాలను, దుర్భర బానిస జీవితాన్ని నవలాకారుడు హృదయానికి హత్తుకునేలా రాశారన్నారు. బలమైన కథనం, కథతో నవల చాలా బిగింపుగా సాగిపోతుందని వివరించారు. ఉత్తమ నవలగా 'ఆడు జీవితం' చరిత్రలో నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు, రచయితలు ఎస్.విజయ్‌కుమార్, శేఖరమంత్రి ప్రభాకర్, డి.వి.సూర్యారావు, చిన సూర్యనారాయణ, కొత్తూరి రమణ, కుప్పిలి భీమేశ్వరరావు, కె.వి.ఎస్.మూర్తి, ఉప్పల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.